

జహీరాబాద్‌లో సభావేదిక వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రూపేశ్



జహీరాబాద్‌లో ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

# నేడు జిల్లాకు గులాబీ దళపతి

- పటాన్‌చెరు, జహీరాబాద్‌లో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు
- భారీ జన సమీకరణకు సన్నాహాలు
- ఎమ్మెల్యేలు మహిపాల్ రెడ్డి, మాణిక్‌రావు
- విజయవంతం చేయాలని పిలుపు
- సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

పటాన్‌చెరు/ జహీరాబాద్, నవంబర్ 22 : గులాబీ దళపతి, బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ గురువారం సంగారెడ్డి జిల్లాకు రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పటాన్‌చెరు, జహీరాబాద్‌లో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాదసభల్లో పాల్గొంటారు. పటాన్‌చెరు పట్టణంలోని పటేల్‌గూడ శివారులో ఎల్లంకి కళాశాల సమీపంలో, జహీరాబాద్ పట్టణంలోని అల్గోల్ బైపాస్ రోడ్డు పక్కన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహిస్తున్నారు. జహీరాబాద్‌లో నిర్వహించనున్న సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్ రావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్ బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. పటాన్‌చెరులో బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజా ఆశీర్వాదసభకు ఆయా నియోజకవర్గాల్లోని మండలాల నుంచి ప్రజలు పెద్దఎత్తున హాజరుకానున్నారు. పటాన్‌చెరులో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాదసభ నిర్వహిస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయేలా సీఎం సభను నిర్వహిస్తామన్నారు. దాదాపు లక్షన్నర మంది ప్రజలతో సీఎం సభను నిర్వహిస్తామని పేర్కొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంనుంచి ప్రజలు భారీగా హాజరవుతున్నారన్నారు. రెండు లక్షల మంది స్వచ్ఛందంగా వస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసి సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు. అందరి సహకారంతో సభను చరిత్రలో నిలిచేలా నిర్వహిద్దామన్నారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ముచ్చటగా మూడో మారు బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, పటాన్‌చెరులో రికార్డుస్థాయి మెజార్టీతో తాను గెలుస్తానని మహిపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తాను ప్రజలకు ఇచ్చిన హామీలను అధికశాతం నెరవేర్చానన్నారు. ప్రతి ఇంట్లో సంక్షేమం, ప్రతి గ్రామంలో అభివృద్ధి మీకు కనిపిస్తుందన్నారు. 2018 పటాన్‌చెరు ఎన్నికల ప్రచారసభలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను పూర్తి చేశానని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి లభిస్తున్న ప్రజాదరణను చూసి, ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేకపోతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ ఆయన చేసిన అభివృద్ధిని చెప్పకుండా, తనను వ్యక్తిగతంగా విమర్శించడం తగదన్నారు. రాజకీయాల్లో విమర్శలు వ్యక్తిగతంగా ఉండొద్దని సూచించారు.

సమావేశంలో యూపీ మాజీ ఎమ్మెల్యే మనోజ్‌కుమార్, జడ్పీటీసీలు ప్రభాకర్, సుప్రజావెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, ఎంపీపీ సుష్మాశ్రీవేణుగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఆత్మకమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, బీఆర్ఎస్ నాయకులె శంకర్‌యాదవ్, సోమిరెడ్డి, శ్రీశైలంయాదవ్, అంజయ్యయాదవ్, పాండు పాల్గొన్నారు.

**జహీరాబాద్ సభకు 50 వేల మంది**

**★ పర్యవేక్షణ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్‌రావు**

జహీరాబాద్‌లో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాదసభను భారీస్థాయిలో నిర్వహిస్తామని ఎమ్మెల్యే మాణిక్‌రావు తెలిపారు. జహీరాబాద్‌లోని అల్గోల్ రోడ్డులో సభ వేదిక సిద్ధం చేశారు. ఆశీర్వాదసభకు జహీరాబాద్ పట్టణం, మండలం, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలం నుంచి 50 వేల మందిని సమీకరిస్తున్నారు. ఏర్పాట్లను ఎమ్మెల్యే మాణిక్‌రావు, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ పర్యవేక్షిస్తున్నారు.

**గులాబీమయంగా జహీరాబాద్ పట్టణం..**

సీఎం కేసీఆర్ పర్యటనతో జహీరాబాద్ పట్టణం గులాబీమయంగా మారింది. భారీ బ్యానర్లు, కటౌట్లు ఏర్పాటు చేశారు. సీఎం సభను కనీవిని ఎరుగని రీతిలో నిర్వహించేందుకు గులాబీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి గ్రామం నుంచి భారీగా ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.





పటాన్‌చెరులో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభా వేదిక వద్ద ఏర్పాట్లు

## నేడు మంత్రి హరీశ్‌రావు పర్యటన

- కంది మండలంలో గౌడ, మైనార్టీ ఆత్మీయ సమ్మేళనాలకు మంత్రి హాజరు

సంగారెడ్డి, నవంబర్ 22 : సంగారెడ్డి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు పర్యటిస్తున్నారు. గురువారం ఉదయం 11గంటలకు కంది మండల శివారులోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేస్తున్న గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు సంగారెడ్డి పట్టణంలోని కింగ్స్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేస్తున్న మైనార్టీ ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి హాజరై బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను గెలిపించాలని కోరనున్నారు. సంగారెడ్డిలో పర్యటన అనంతరం సదాశివపేట పట్టణంలో బైక్ ర్యాలీలో మంత్రి పాల్గొని రోడ్‌షో నిర్వహిస్తారు.

### ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు
## పకడ్బందీగా పూర్తి చేయాలి

- ఈసీఐ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్‌కుమార్ వ్యాస్



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్లు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 22 : ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఈసీఐ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్‌కుమార్ వ్యాస్ ఆదేశించారు. బుధవారం న్యూఢిల్లీ నుంచి భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్‌కుమార్ వ్యాస్ తెలంగాణ శాసనసభ ఎన్నికల నిర్వహణ, సన్నద్ధతపై జిల్లా ఎన్నికల అధికారితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ నిర్వహణ కోసం చేపట్టిన చర్యల గురించి కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఓటరు స్లిప్పులను 98 శాతం పంపిణీ పూర్తి చేశామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ఏవో పరమేశ్ ఉన్నారు.

## శిక్షణకు ఉద్యోగులు హాజరుకావాలి

- జిల్లా నోడల్ అధికారి, డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 22 : సాధారణ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో పీవో, ఏపీవో, ఓపీవోలకు ఈ నెల 21, 22తేదీల్లో శిక్షణ నిర్వహిస్తున్నామని, శిక్షణకు హాజరుకాని ఉద్యోగులు ఈ నెల 23న కేటాయించిన ఎన్నికల శిక్షణ కేంద్రంలో విధిగా హాజరుకావాలని జిల్లా నోడల్ అధికారి, డీఈవో వెంకటేశ్వర్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న నిర్వహించే శిక్షణ తరగతులకు గైర్హాజరైన ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్టు స్పష్టం చేశారు. సాధారణ ఎన్నికల నియమావళి ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల విధులకు సంబంధించిన శిక్షణకు ఉద్యోగులు విధిగా హాజరుకావాలని ఆయన స్పష్టం చేశారు.

## స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించాలి



కలెక్టరేట్‌లో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకుడు బాలకృష్ణన్

- అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను పకడ్బందీగా పరిశీలించాలి
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకుడు బాలకృష్ణన్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 22 : జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా జరిగేలా అన్ని విధాల చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకుడు బాలకృష్ణన్ ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకుడు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి శరత్, ఎస్పీ రూపేశ్, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు కేపీ జయకర్, విజయ్‌కృష్ణ, అదనపు కలెక్టర్లు, నోడల్ అధికారులు, సహాయ వ్యయ పరిశీలకులతో సమావేశమయ్యారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు, బ్యాంకు లావాదేవీలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు, ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను నిశితంగా పరిశీలిస్తూనే బ్యాంకు లావాదేవీలపై దృష్టి సారించాలన్నారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు చేపడుతున్న ప్రలోభాలు మద్యం, డబ్బు, బహుమతుల పంపిణీపై నిఘా పెంచాలని సూచించారు. ఎన్నికలు దగ్గర పడుతున్నందున వారం రోజుల పాటు అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజలకు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

**జిల్లాలో 1609 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు**

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో చేపట్టిన ఏర్పాట్ల గురించి రాష్ట్ర వ్యయ ప్రత్యేక పరిశీలకునికి వివరించారు. జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో 102 మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో 1609 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ 98 శాతం పూర్తయిందన్నారు. పోలింగ్ నిర్వహణకు, ఓట్ల లెక్కింపునకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్టు వెల్లడించారు. జిల్లాలో పోలీస్ శాఖ చేపడుతున్న తనిఖీలు, శాంతి భద్రతలపై తీసుకుంటున్న చర్యలను ఎస్పీ రూపేశ్ వివరించారు. సమావేశంలో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు కేపీ జయకర్, విజయ్‌కృష, అదనపు కలెక్టర్లు, నోడల్ అధికారులు, సహాయ వ్యయ పరిశీలకులు, ఆదాయశాఖ అధికారులు, లీడ్ బ్యాంక్ మేనేజర్, ఎక్సైజ్, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.